వెంకటేశ్వర - సిద్దిపేట
నటరాజ్ 70 - సంగారెడ్డి
జ్యోతి 70 - సదాశివపేట
మోహన్ 70 - జహీరాబాద్
శ్రీనివాస 70 - నర్సాపూర్
యాదగిరి 70 - గజ్వేల్
వెంకటేశ్వర - నారాయణఖేడ్
వెంకటేశ్వర - తూప్రాన్

### రంగారెడ్డి
లక్ష్మి 70ఎంఎం - తాండూరు
శివాజీ 70 - వికారాబాద్
మణికంఠ 70 - చేవెళ్ల
సాయిబాబా - శంకర్‌పల్లి

### రాయచూర్
మిరజ్ సినిమాస్ - రాయచూర్
శివ 70 ఎ/సి - గంగావతి
మంజునాథ 70 - సింధనూర్
శివ 70 ఎ/సి - కొప్పల్
పూర్ణ సినిమాస్ - సింధనూర్ జంక్షన్
లక్ష్మి 70ఎంఎం - కర్టగి

GLOBAL CINEMAS RELEASE




ADVANCE BOOKINGS ARE NOW OPEN

## న్యాయశాస్త్రం సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్, అక్టోబరు 8: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో అక్టోబరు 16 నుంచి జరగాల్సిన న్యాయశాస్త్రం సెమిస్టర్ పరీక్షలను గ్రూప్-1 పరీక్షల నేపథ్యంలో వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా పడిన పరీక్షల్లో ఎల్ఎల్‌బీ మూడేళ్ల కోర్సు రెండో సెమిస్టర్, ఎల్ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు ఆరో సెమిస్టర్ అలాగే ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ పరీక్షలున్నాయని వివరించారు.



# సత్తెమ్మ పాట.. రాగాల పూదోట..

**కష్టసుఖాల దొంతరలే ఆమె పాటలకు రూపం**

**ఆకాశవాణిలో ఆలపించిన బతుకమ్మ పాటలు**

**ఆడియో క్యాసెట్లుగా రూపాంతరం**

లింగాలఘణపురం, అక్టోబరు 8:సాహిత్య లోకమెరుగని కళాపిపాసి ఆమె.. ఆమె కైకట్టి పాడే ప్రతీ పాట లక్షల ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుంది. సుస్వరాలు ఎరుగకపోయినా.. అక్షరం ముక్క నేర్వక పోయినా.. బడుగుల కష్టాలను ఒక్కటిగా పోగు చేసినట్లు.. జనజీవన శ్రమైకంలో చిందించే చెమట చుక్కలు రాశులుగా పేర్చినట్లు.. అభాగ్యుల కన్నీటి ధారలను ఒడిసిపట్టి బతుకమ్మ పాట రూపంలో బడుగులకు బతుకు నేర్పుతుంది. జీవితంలో ఎదురయ్యే కష్టం.. సుఖం.. మనోల్లాసానికి ఉపయుక్తమయ్యే ఆటలు.. పాటలు.. ఇలా అన్నీ కలబోసి ఆమె నోట వెలువడే బతుకమ్మ పాట బడుగుల బతుకులకు కొత్త ఊపిరిలూదుతోంది. కనుమరుగవుతున్న సాంస్కృతిక సంరంభాన్ని నాలుగు బాటల వద్ద నిటారుగా నిలబెట్టినట్లు పాడే ఆమె ఉయ్యాల పాట బతుకు భరోసాకు సరికొత్త ఊటగా ఉత్సాహాన్నిస్తుంది. ఆమె కంఠం ఓ ఘంటానాధం.. రాగరంజితాన్ని రంగరించుకున్న ఆమె పాట సెలయేటి ఊటై బడుగుల బతుకులకు భాష్యం నేర్పుతోంది. ఆమే.. లింగాలఘణపురం మండలం నెల్లుట్లకు చెందిన కడకంచి సత్తెమ్మ ఉరఫ్ ఉయ్యాల పాటల సత్తెమ్మ. సత్తెమ్మ రాగం పల్లె బతుకుల జీవన గానం.. కనుమరుగవుతున్న సంస్కృతీ సంప్రదాయాలకు పునరుజ్జీవం పోస్తున్న కళాతపస్వి ఆమె. గడిచిన 60 ఏళ్లుగా నవతరానికి బతుకమ్మ పాటలను నేర్పుతూ బతుకు భాష్యానికి నాందిగా.. సంస్కృతీ సాంప్రదాయాలకు దిక్సూచిగా నిలుస్తోంది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయల వైభవం.. బతుకమ్మ వేడుకల సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం. సత్తెమ్మ గళమెత్తిందంటే చాలు ఇంటి ముంగిళ్లలో గుసగుసలాడే అతివలంతా ఆమె దరికి చేరాల్సిందే. అలా వచ్చిన వాళ్లంతా ఆమె పాటకు వంతపాటాడాల్సిందే. అదే సత్తెమ్మ ప్రత్యేకత.

**కన్నీటి కష్టాలే.. బతుకమ్మ పాటలుగా..**

అక్షరజ్ఞానం అసలే ఎరుగని సత్తెమ్మ తన చుట్టూ నిత్యం ఎదుర్కొంటున్న కష్టాలను.. తోటి వారు ఎదుర్కొంటున్న బాధలను తన జీవితంలో ఎదురైన ఇబ్బందుల సారాన్ని పాటల రూపంలో మలచడం సత్తెమ్మ ప్రత్యేకత. ప్రతీ ఏటా స్వగ్రామం నెల్లుట్లలో మహాలయామావాస్య రోజు జరిగే ఎంగిలి బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ దాకా సత్తెమ్మతో పాటలను పాడించుకునేందుకు స్థానికులు ఉవ్విళ్లూరుతుంటారు.

**ఎల్లలు దాటిన.. సత్తెమ్మ పాటలు..**

బతుకమ్మ పాటలతో పరిచయమైన సత్తెమ్మ తన పాటల తూటాలను వరంగల్ ఆకాశవాణిలో ఉర్రూతలూగించింది. అంతటితో ఆగకుండా తన పాటల ప్రవాహాన్ని ఒగ్గు కళాసామ్రాట్ చుక్క సత్తయ్య, బుగ్గ మల్లయ్య ప్రోత్సాహంతో ఆడియో రికార్డింగ్‌ను కూడా చేయించారు. ఒంగూరి మల్లేశ్‌యాదవ్ నిర్మాణంలో బతుకమ్మ పాటలతో పాటుగా రేణుకా ఎల్లమ్మ, సమ్మక్క సారలమ్మ, మాంధాత, పార్వతీ, బీరప్ప, పెద్దిరాజు, గంగురాజు, శ్రీదేవి, వన్నెల అక్కమ్మ, మల్లన్న, వేములవాడ రాజన్నకు చెందిన పురాణ కథలను అనర్గలంగా చెబుతూ సత్తెమ్మ తన ప్రావీణ్యాన్ని వేనోళ్ల చాటుతోంది. సత్తెమ్మ పాడిన ఉయ్యాల పాటలు, బతుకమ్మ పాటలు క్యాసెట్లు, సీడీల రూపంలో తయారై ఎంతో మందికి సాంస్కృతిక సంబరాన్ని పంచిస్తోంది. తెలంగాణ స్వరాష్ట్రంలో బతుకమ్మ పాటలకు విశేష ఆదరణ లభిస్తుందని ఆనందం వ్యక్తం చేస్తుంది.



**20వ ఏట నుంచి పాటల తూటాగా ఎదిగి..**

సత్తెమ్మ తన 20వ ఏట నుంచే పాటల తూటగా ఎదిగింది. ప్రస్తుతం 80 ఏళ్ల వయసున్న సత్తెమ్మ గళం ఇప్పటికీ ఓ ఘంటారావమై మారుమ్రోగుతుంది. వయసు మీదపడ్డా తన కంఠంలో పదును ఏమాత్రం తగ్గలేదని, ఏటేటా పాటల సవ్వడిలో నిత్యనూతనమే నంటూ నిరూపిస్తుంది. జనగామ మండలం గానుగుపహాడ్‌కు చెందిన సత్తెమ్మకు చిన్నతనంలో 10వ ఏటలోనే నెల్లుట్లకు చెందిన కడకంచి బీరయ్యతో బాల్యవివాహం జరిగింది. పెళ్లైన 10 ఏళ్ల తర్వాత తన పాటకు పదును పెట్టి 60 ఏళ్లుగా వెనకకు తిరగకుండా బతుకమ్మ పాటలకు జీవంపోస్తుండటం గమనార్హం.

"అడవుల్లో పుట్టినావా గౌరమ్మా..
ఆకుల్లో పెరిగినావా గౌరమ్మ..
నిండు అమాసనాడూ గౌరమ్మా..
మా ఇంటికొచ్చినావా గౌరమ్మ..
పూవుల్ల పూజిద్దునా గౌరమ్మా..
గంధాన కరిగిద్దునా గౌరమ్మ..
తీగమల్లెలు తెచ్చి.. నాగ మల్లెలు తెచ్చి..
తీగమల్లెలు తెచ్చి.. నాగ మల్లెలు తెచ్చి..
నాగమల్లెలు తెద్దునా గౌరమ్మా..
నిన్నే పూజిద్దునా గౌరమ్మ..
బ్రాహ్మణులను పిలుపిద్దునా గౌరమ్మా..
అక్షింతలు వేయిద్దునా గౌరమ్మ..
అద్దమడుగు నెయ్యి.. ఆవునేతి బొట్టు..
నేతిలో కరిగిద్దునా గౌరమ్మా..
మల్లెల్లో పూజిద్దునా గౌరమ్మ..
ఎన్నెన్నో పూజలు మెప్పుగా జేయించి..
గొప్పగా జేయిద్దునా గౌరమ్మా..
గంగలో ఒదిలొద్దునా గౌరమ్మ"

# డ్యూటీ మీట్ పోటీలతో వృత్తి నైపుణ్యం పెరుగుతుంది..

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

వరంగల్ క్రైం, అక్టోబర్ 8: డ్యూటీ మీట్ పోటీల్లో పాల్గొనడం ద్వారా పోలీసు అధికారులు తమ వృత్తిలో మరింత రాణించొచ్చని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. మూడురోజుల పాటు కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన జోనల్ పోలీసు డ్యూటీ మీట్‌లో విజయం సాధించిన పోలీసు అధికారులకు సీపీ మంగళవారం పతకాలను బహూకరించారు. భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు పాల్గొన్న జోనల్ స్థాయి డ్యూటీ మీట్ ఈనెల 3వతేదీ నుంచి మూడు రోజుల పాటు వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. అధికారులు రోజువారీగా నిర్వహించే విధులకు సంబంధించి 18 విభాగాల్లో పోటీలను నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి సీపీ చేతుల మీదుగా పతకాలు అందచేశారు. విజేతలు ఈనెలలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. వృత్తిలో నైపుణ్యం సాధించడం ద్వారా నురస్థులను గుర్తించడం సులభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్రతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



విజయం సాధించిన పోలీసులతో సీపీ అంబర్ కిషోర్ ఝా

# అభ్యర్థుల్లేక ఆగిన పోస్టులు 59

**నేడు హైదరాబాద్‌కు కొత్త టీచర్ల పయనం**


**ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు**

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 8: డీఎస్సీ-2024 నియామకాల ప్రక్రియ ఎట్టకేలకు ముగియనుంది. ఈ నెల 3 నుంచి 5 వరకు 1:3 ప్రాతిపదికన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించగా, మంగళవారం ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థుల జాబితాలను సంబంధిత డీఈవోలు వారి కార్యాలయ వెబ్‌సైట్లలో పొందుపరిచారు. అయితే రెండు జిల్లాల్లో 488 పోస్టులు భర్తీ కానున్నాయని ముందుగా ప్రకటించినప్పటికీ సంబంధిత కేటగిరీల్లో అభ్యర్థులు లేకపోవడంతో 59 పోస్టులు మళ్లీ ఖాళీగానే దర్శనమీయనున్నాయి.

వరంగల్ జిల్లాలో 17 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు సంబంధిత క్వాలిఫికేషన్ ఉన్న అభ్యర్థులు లేకపోవడంతో వాటిని ఖాళీలుగానే ఉంచారు. అలాగే వివిధ కేటగిరీల్లో అభ్యర్థులు లేక 21 పోస్టులు బ్యాక్‌లాగ్‌గా మిగిలాయి. కాగా, జిల్లాలో మొత్తం 301 పోస్టులకుగాను 38 పోస్టులు ఖాళీలుగానే మిలిగిపోయాయి. ఇక హనుమకొండ జిల్లాలో స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులకు సంబంధిత క్వాలిఫికేషన్ గల అభ్యర్థులు లేకపోవడంతో 12 పోస్టులు ఖాళీలుగానే మిగలగా, ఎస్జీటీల్లో సంబంధిత కేటగిరీల్లో 6 పోస్టులకు సంబంధిత క్వాలిఫికేషన్ అభ్యర్థులు లేకపోవడంతో అవి బ్యాక్‌లాగ్ పోస్టులుగా మిగిలిపోనున్నాయి. మొత్తంగా జిల్లాలో 187 పోస్టులకు 18 పోస్టులు ఖాళీగానే మిగలనున్నాయి. కాగా, కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకోనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ యంత్రాంగం కొత్తగా ఎంపికైన అభ్యర్థులను బస్సుల్లో హైదరాబాద్ తరలించేందుకు అన్ని చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద నుంచి వారిని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

# డైట్ బకాయిలు చెల్లించండి

**బోధన ఆస్పత్రుల డైట్ కాంట్రాక్టర్ల మొర**



వరంగల్ మెడికల్, అక్టోబరు 8: ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బోధన ఆస్పత్రులలో డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని డైట్ కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల కాలంగా నిధులు విడుదల చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడు నెలలకోసారి బిల్లులు మంజూరు చేయాల్సి ఉన్నప్పటికీ ఆరు నెలలకు పైగా గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా విడుదల చేయడం లేదని కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు చికిత్స చేస్తున్న వైద్యులకు ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్న తమను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో రూ.3 కోట్లు, వరంగల్ సీకేఎం ఆస్పత్రిలో రూ.36లక్షలు, హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రూ.33లక్షలు, టీబీ ఆస్పత్రిలో రూ.15లక్షలు, వరంగల్ కంటి ఆస్పత్రిలో రూ.15లక్షల నిధులు పెండింగ్‌లో ఉన్నాయని డైట్ కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వద్ద పనిచేసే ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామని, దసరా, దీపావళి పండుగలు ఉన్న నేపథ్యంలో బిల్లులను వెంటనే మంజూరు చేయాలని వారు కోరారు.

# నాలుగు ఉద్యోగాలకు అర్హత సాధించిన యువకుడు



మాలోత్ సుకుమార్

పర్వతగిరి, అక్టోబరు 8: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని దౌలత్‌నగర్ గ్రామశివారు బాజుతండాకు చెందిన మాలోత్ సుకుమార్ అనే యువకుడు ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించాడు. బాజుతండాకు చెందిన మాలోత్ శేర్యా- పతాని దంపతులకు ఒక కూతురు రజిత, ఇద్దరు కుమారులు రాము, సుకుమార్ ఉన్నారు. రజితకు వివాహం కాగా, పెద్దకుమారుడు రాము డిగ్రీ పూర్తిచేసి తండాలో తల్లిదండ్రులకు వ్యవసాయంలో చేదోడుగా ఉంటున్నాడు. చిన్నకుమారుడు సుకుమార్ ఎన్ఐటీ వరంగల్‌లో 2021లో ఎంటెక్ పూర్తిచేసి ఉద్యోగప్రయత్నాల్లో భాగంగా పలు పోటీపరీక్షలు రాశాడు. ఏకంగా నాలుగు ఉద్యోగాలకు అర్హత సాధించాడు. స్టాఫ్‌సెలక్షన్ కమిషన్(ఎస్సెస్సీ)లో జూనియర్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పాలిటెక్నిక్ లెక్చరర్, అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులకు ఎంపికయ్యారు. నాలుగు పోస్టులకు అర్హత సాధించగా పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఏఈఈగా ఉద్యోగంలో చేరి సేవలందించడానికి గాను సుకుమార్ సుముఖతను వ్యక్తం చేశారు. తమ కుమారుడు ఏకంగా నాలుగు ఉద్యోగాలు సాధించడంతో ఇటు తల్లిదండ్రులతో పాటు అటు తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.



# పేదరికం అడ్డురాలే.. వైకల్యంతో కుంగిపోలే..

**క్రీడాకారులు దీప్తిని స్ఫూర్తిగా తీసుకోవాలి**

**అథ్లెటిక్స్ ఇండియా చీఫ్ కోచ్ నాగపురి రమేష్**

**రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల ముగింపు వేడుకల్లో వెల్లడి**




పరుగు పందెంలో విజేతగా నిలిచిన క్రీడాకారులకు మెడల్స్ ప్రదానం చేస్తున్న హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్ అక్టోబరు 8: చాలామంది తమలో ఉన్న చిన్న చిన్న లోపాలకే కుంగిపోతూ వైకల్యం ఉంటే ఏదీ సాధించలేమనే భావనతో ఉన్నవారికి జీవంజి దీప్తి స్ఫూర్తిగా నిలిచారని అథ్లెటిక్స్ ఇండియా చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ కొనియాడారు. హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేఎన్ఎస్‌లోని సింథటిక్ ట్రాక్‌పై రెండు రోజులుగా నిర్వహిస్తున్న 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇతర అమ్మాయిలా మాదిరిగా కాకుండా కొంత భిన్నంగా ఉండడంతో పలువురు దీప్తిని హేళన చేయడంతో ఆమె కుంగిపోకుండా మొక్కవోని దీక్షతో పారాలింపిక్స్‌లో పాల్గొని కాంస్య పతకం సాధించడంతో నేడు తనతో ఫొటోలు దిగేందుకు ఉత్సాహాన్ని కనబరుస్తున్నారన్నారు. ఇటీవల నిర్వహించిన పారాలింపిక్స్‌లో కల్లెడకు చెందిన జీవంజి దీప్తికి తెలుగురాష్ట్రాల్లో కాంస్య పతకం సాధించిన ఘనత దక్కిందన్నారు. తన దగ్గర అథ్లెటిక్స్‌లో తర్ఫీదు పొందుతూ ఒలంపిక్స్‌లో దీప్తి కాంస్య పతకం సాధించడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. పారాలింపిక్స్ కాంస్య పతక విజేత జీవంజి దీప్తి మాట్లాడుతూ.. ఒలంపిక్స్‌లో పతకం సాధించడం కోసం ఆహర్నిషలు కష్టపడుతూ కోచ్ నాగపురి రమేష్ సలహాలు సూచనలతో కాంస్య పతకం సాధించానన్నారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. అండర్ -14, 16, 18, 20 బాల బాలికల విభాగాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో సుమారు 1,100 మంది క్రీడాకారులు, 100 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారన్నారు. 100, 400, 600, 3000, 10,000 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్, ట్రిబుల్ జంప్, హైజంప్, జావెలిన్‌త్రో, హ్యామర్‌త్రో, డిస్కస్‌త్రో, స్టీపుల్‌చేజ్, 110 మీటర్ల హార్డిల్స్, 4ఇంటు 400 మిడ్ రిలే, ట్రయాత్లేన్, పోల్‌వాల్ట్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డీవైఎస్‌వో జి.అశోక్‌కుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గట్టు మహేష్‌గౌడ్‌బాబు, ములుగు జిల్లా అసోసియేషన్ బాధ్యులు పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, నిజామాబాద్, నారాయణపేట జిల్లాల కార్యదర్శులు రాజాగౌడ్, రమణ, పీడీలు రజినీకాంత్, మనోజ్, కోచ్‌లు శ్రీమన్నారాయణ, దిమ్మిక నాగరాజు, టెక్నికల్ అఫిషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

**హోరాహోరీగా పోరు**

అథ్లెటిక్స్ ఫైనల్ ఈవెంట్లు హోరాహోరీగా జరిగాయి. క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా తమ సత్తా చాటుకున్నారు. 100 మీటరు, 3000 మీటర్లు, హార్డిల్స్ స్టీపుల్ చేజ్ పోటీల్లో ఒకరికి మించి ఒకరు గెలవాలని సంకల్పంతో ఎండ వేడిమిని లెక్కచేయకుండా అనుకున్న లక్ష్యంవైపు పరుగులు తీశారు. రెండో రోజు నిర్వహించిన ఫైనల్స్ అండర్-18 బాలుర 100మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం గణేష్ (నల్లగొండ), ద్వితీయ స్థానం ఎస్.హర్షవర్ధన్ (రంగారెడ్డి), తృతీయ స్థానం కె.అశోక్ (ఖమ్మం) సాధించారు. బాలికల విభాగంలో ప్రథమ స్థానం షేక్ సుహాని (హైదరాబాద్), ద్వితీయ స్థానం ఎం.అక్షిత (రంగారెడ్డి), తృతీయ స్థానం అమ్మ అంజుం (మంచిర్యాల) సాధించారు. అండర్- 20 బాలికల 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం ఎస్.ప్రవళిక(నల్లగొండ), ద్వితీయ స్థానం రాగవర్శిని(హైదరాబాద్), తృతీయ స్థానం ఎం.శృతి(నాగర్‌కర్నూల్) పొందారు. అండర్-20 బాలుర జావెలిన్‌త్రోలో ప్రథమ స్థానం కె.స్వామి, ద్వితీయ స్థానం పి.నగేష్, తృతీయ స్థానం ఆర్.తరుణ్‌కుమార్ సాధించారు.



అండర్20 బాలుర పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు


తొర్రూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో బతుకమ్మ వేడుకలు


మరిపెడలోమాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మురళీధర్

# ప్రభుత్వ ఆస్పత్రుల్లో బతుకమ్మ వేడుకలు

తొర్రూరు, అక్టోబరు 8 : తొర్రూరు పట్టణంలోని 4పీహెచ్‌సీల పరిధిలోని వైద్య ఉద్యోగులు మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులందరు ఒకేచోట చేరి ఆటపాటలు, కోలాటాలు, నృత్యాలతో ప్రాంగణమంతా సంస్కృత శోభతో సందడి చేశారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యుడు సుగుణాకర్ రాజు మాట్లాడుతూ మహిళలు తారతమ్య భేదం లేకుండా ఒకేచోట చేరి బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వం బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జ్వలిత, మీరజ్, మానస, సుగుణాకర్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

● మరిపెడ : తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ వేడుకలని డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్ అన్నారు. మంగళవారం మరిపెడ పీహెచ్‌సీలో మహిళ వైద్యులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు బతుకమ్మ పండుగ వేడుకలను నిర్వహించగా జిల్లా వైద్యాధికారి మురళీధర్ పాల్గొన్నారు. మహిళలతో జత కలిసి బతుకమ్మ ఆట, పాటలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పూలను పూజించే సంస్కృతి ఎంతో విశిష్టమైనదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవినాయక్, డీపీహెచ్ఎన్ మంగమ్మ, నర్సింగ్ సూపరిండెంట్ విజయలక్ష్మీ, సూపర్‌వైజర్లు సుదర్శన్, లక్ష్మీ, మాధవి, స్టాఫ్‌నర్స్‌లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

# 'రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి'

గార్ల అక్టోబరు 8 : పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటూ, మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో మురళీధర్ అన్నారు. మంగళవారం ముల్కనూరు పీహెచ్‌సీ ఆస్పత్రిని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్‌హెల్త్‌ప్రోగ్రాం టార్గెట్‌ను సత్వరమే పూర్తి చేయాలన్నారు. మాతాశిశు సంక్షేమ కార్యక్రమంలో భాగంగా గర్భిణీల నమోదును వేగవంతం చేసి, వారందరికి టీకాలు వేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచే విధంగా సిబ్బంది పనిచేయాలన్నారు. అనంతరం ఆస్పత్రిలోని పరిసరాలను పరిశీలించి, పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆస్పత్రి ఆవరణలో సిబ్బంది బతుకమ్మలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, డీపీవో రవీందర్, సిబ్బంది సక్కుబాయి, మంగమ్మ, పాల్గొన్నారు.

## కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న మోదీ

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

కురవి, అక్టోబరు 8 : కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న మోదీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతూ... పేదలపై భారాలు వేస్తుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య విమర్శించారు.నేరడలో మంగళవారం జరిగిన గ్రామ మహాసభలో ఆయన మాట్లాడుతూ స్విస్‌బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తెచ్చి జన్‌ధన్ ఖాతాల పేదల అకౌంట్లలో నగదు వేస్తామని ప్రకటించిన మోదీ ఏ ఒక్కరి ఖాతాల్లో పైసా వేయలేదని విమర్శించారు. చలగొల్ల లక్ష్మీనగర్‌లో తుడుం ప్రశాంత్, జక్కుల వీరన్న ప్రాంగణంలో కడియం వినోద, జక్కుల మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, అకుల రాజు, శెట్టి వెంకన్న, మలేడి కోటయ్య, నల్లపు సుధాకర్, పోతుగంటి మల్లయ్య, తగరం తిరుపతి, రాయల మనోహర్, కృష్ణ, జంగం ఉప్పలయ్య, దుస్స వెంకన్న పాల్గొన్నారు.

# ఆడపిల్లలను రక్షించుకుందాం

● ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్


జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 8 : నేటి సమాజంలో బతుకమ్మలను ఏ విధంగా అయితే మనం బతికించుకుంటున్నామో.. అదే విధంగా ఆడపిల్లలను కూడా రక్షించుకోవాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం 'ఆడపిల్లలను రక్షించుకుందాం' అని ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలపై జరిగే అత్యాచారాలను నిర్మూలించి భ్రూణ హత్యల ద్వారా ఆడపిల్లలను చంపకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఆడపిల్లల నిష్పత్తిని పెంచాలని, సమాజంలో ఆడపిల్లలకు గౌరవాన్ని అందించాలన్నారు. ఆడపిల్లలను పుట్టనిద్దాం.. బతుకనిద్దాం.. చదువనిద్దాం వారికి చక్కటి భవిష్యత్‌నిద్దాం.. రేపటి సమాజానికి తల్లిని,చెల్లిని, స్నేహితురాలిని అందిద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, డేవిడ్, అశోక్ పాల్గొన్నారు.

## ముగ్గురు మరిపెడ టీచర్లకు పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుల హోదా


ఉపేందర్‌రెడ్డి, లింగయ్య, రాంమోహన్

మరిపెడ, అక్టోబరు 8 : మండలానికి చెందిన ముగ్గురు టీచర్లకు పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుల హోదా కలిపించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఆ సంఘం 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం అంతాయిపల్లి శామీర్‌పేటలోని ఎస్ఎన్ఆర్ పుష్ప కన్వెన్షన్‌లో జరుగుగా, మరిపెడకు చెందిన కుడితి ఉపేందర్‌రెడ్డి, దోమల లింగయ్య, బయ్యాగాని రాంమోహన్‌లను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అబ్బూరి సునీల్‌కుమార్, రాయిపెల్లి యాకయ్య, రాష్ట్ర కార్యదర్శిగా బి.దత్తప్రసాద్ ఎన్నికయ్యారు. వీరి ఎన్నికపట్ల సంఘం మరిపెడ మండల బాధ్యులు కీసర రమేశ్‌రెడ్డి, లింగాల మహేశ్, అర్జున్, కరుణాకర్, వెంకన్న, యాదగిరి, వెంకటయ్య, రవి, భరత్, విజయ్‌కుమారులు హర్షం వ్యక్తం చేశారు.

### నెల్లికుదురులో..

● నెల్లికుదురు : పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గంలో మండలం లో వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఏడుగురు ఉపాధ్యాయులకు చోటు లభించింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా బానోత్ లక్ష్మణ్, శేషుకుమార్, బొమ్మరాతి సాయిలు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా భూసాని సోమయ్య, కేతిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులుగా గంగుల జనార్దన్, ఆకుల దేవన్నను ఏకగ్రీవగంగా ఎన్నుకున్నారు.

### ముగ్గురు అసోసియేట్ అధ్యక్షుల నియామకం


యాకయ్య, నరేందర్, కనకయ్య

● కేసముద్రం : హైదరాబాద్‌లో ఈనెల 7, 8 తేదీల్లో నియమించిన పీఆర్‌యూటీ రాష్ట్ర కమిటీలో కేసముద్రం మండలం నుంచి తొమ్మిది ఉపాధ్యాయులకు స్థానం దక్కినట్లు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల శ్రీధర్, బీరం జనార్ధన్‌రెడ్డి తెలిపారు. సంఘం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులుగా రాపోలు యాకయ్య, బండారు నరేందర్, కోట కనకయ్య, ఉపాధ్యక్షులుగా దాసరి వీరభద్రయ్య, కొలిశెట్టి భాస్కర్, కల్లూరి శ్రీనివాస్, దేశబోయిన వెంకన్న, మేకల సురేష్, కార్యదర్శిగా ఏదునూరి అశోక్‌లను ఎన్నుకున్నారని తెలిపారు.

## కూలిరేట్ల పెంపుపై చర్చలు వాయిదా

కేసముద్రం, అక్టోబరు 8 : కేసముద్రం మార్కెట్లో పనిచేస్తున్న కూలీల రేట్ల పెంపు విషయంపై మంగళవారం చైర్మన్ గంట సంజీవరెడ్డి సమక్షంలో ఇరుపక్షాల మధ్య నిర్వహించిన చర్చలు ఏకాభిప్రాయం రానందున ఈనెల 17కు వాయిదా పడినట్లు ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు శివ్వారపు శ్రీధర్ తెలిపారు. కూలీ రేట్ల పెంపుకోసం మార్కెట్లో ఇటీవలె మెరుపు సమ్మె నిర్వహించిన విషయం విధితమే. మార్కెట్లో దడువాయిలు, హమాలీ రేట్లను పెంచి కూలీలను విస్మరించారని తెలిపారు.

## నివాస స్థలాలపై తప్పుడు ఫిర్యాదు చేశారని కలెక్టర్‌కు వినతి

కేసముద్రం, అక్టోబరు 8 : కేసముద్రం విలేజి పశువైద్యశాల ప్రహరీ వెంట ఖాళీగా ఉన్న స్థలాన్ని భూ యజమాని 40 ఏళ్ల క్రితం మాకు దానంగా ఇచ్చారని, ఈ స్థలం పశువైద్యశాలకు చెందినది కాదని గ్రామానికి చెందిన కొప్పు వీరస్వామి, ఎస్‌కె. అమీర్, వెన్ను ఎల్లయ్య, జవ్వాజి ఐలయ్య, వేల్పుల ఐలయ్య, రావుల సారయ్య, మాదసారి వెంకన్నలు తెలిపారు. గ్రామంలో మంగళవారం వారు మాట్లాడుతూ ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రహరీ వెంట మిగిలిన స్థలాన్ని తమకు దానంగా ఇచ్చారని, కొంతమంది వ్యక్తులు తమ స్వలాభం కోసం అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేశారని ఆరోపించారు.

## చైర్మన్‌ను సన్మానించిన ఛాంబర్ ఆఫ్ కామర్స్


కేసముద్రం మార్కెట్లో చైర్మన్ సంజీవరెడ్డిని సన్మానిస్తున్న వ్యాపారులు

కేసముద్రం, అక్టోబరు 8 : ఇటీవలె బాధ్యతలు స్వీకరించిన మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, సభ్యులు చిదురాల వసంతరావు, వోలం రమేష్‌ను ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వోలం ప్రభుకిరణ్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బోనగిరి ఉపెందర్, కోశాధికారి కొల్లూరు రమేష్, బిజ్జాల వెంకటేశ్వర్లు, అనుమాండ్ల వేణుగోపాల్‌రెడ్డి, సంకెపల్లి జనార్ధన్‌రెడ్డి, శ్రీరాంవెంకటేశ్వర్లు, గార్లపాటి ప్రదీప్, ప్రమోద్, ఆగె నాగరాజు, కొత్తకొండ ఆకాశ్, సట్ల శ్రీను, సంపత్‌రెడ్డి, కొల్లూరు శ్రీను, నవీన్, మాసాడి శ్రీను, చిన్నా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సొంత ఖర్చులతో రహదారి మరమ్మతులు

కురవి, అక్టోబరు 8 : కురవికి చెందిన బుక్క వీరన్న సొంత ఖర్చులతో రహదారికి మరమ్మతులు చేయించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముత్యాలమ్మకుంట సీసీ రోడ్డు కింద రహదారి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఎడ్లబండ్ల రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో స్పందించిన వీరన్న సొంతంగా జేసీబీని ఏర్పాటు చేసి మొరం తెప్పించి రహదారిని బాగు చేశారు. గ్రామస్తులు, రైతులు వీరన్నను అభినందించారు.

# ప్రతీ సంక్షేమ పథకాన్ని సర్కార్ అమలు చేస్తుంది


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అంబటి వీరభద్రం

కురవి, అక్టోబరు 8 : ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్‌ప్రభుత్వం అన్ని హామీలను అమలుచేసి తీరుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం అన్నారు. కురవిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి కేవలం రూ.25 వేలతో సరిపెట్టిందన్నారు. ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కార్ ఇప్పటికే రూ.లక్ష రుణమాఫీని పూర్తిగా అమలు చేసిందని, రూ.2 లక్షలకుపైగా ఉన్న రుణమాఫీలు మాత్రమే మాఫీ కాలేదని, రైతులు రూ.2 లక్షలకు పైగా ఉన్న నగదును జమ చేస్తే ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, నిరుపేదలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా, రూ.500ల గ్యాస్ సబ్సిడీని ఇప్పటికే అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శలు చేసిన ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ ఎమ్మెల్యేగా, మంత్రిగా డోర్నకల్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. అధికారంలోకి వచ్చాక ఏమి చేయలేదని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను విమర్శించడం శోచనీయమన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద డోర్నకల్ నియోజకవర్గంలో ఇప్పటికే రూ.14 కోట్ల పనులు చేశామని, మరిపెడ, డోర్నకల్ మునిసిపాలిటీల్లో తాగునీటి కోసం ఇప్పటికే రూ.25 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, దేవాలయ చైర్మన్ కొర్ని రవీందర్‌రెడ్డి, అవిరె మోహన్‌రావు, బలగాని శ్రీనివాస్, బాదావత్ రామునాయక్, బానోత్ తుకారంనాయక్, బండి లక్ష్మారెడ్డి, ఎన్.రాజేందర్‌కుమార్, ఇస్లావత్ సుధాకర్, బుక్క నాగరాజు, మేక దామోదర్‌రెడ్డి, చిన్నం గణేష్, దొంగల జనార్ధన్‌రెడ్డి, కానుగంటి వీరన్న, శ్రీధర్, దైద భద్రయ్య పాల్గొన్నారు.

## అభివృద్ధికే పట్టం కట్టిన ప్రజలు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్‌రెడ్డి

తొర్రూరు, అక్టోబరు8 : హర్యానాలో బీజేపీ గెలుపు ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టారని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పదంలో ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రపంచ అగ్ర దేశాలకు దీటుగా ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసి ప్రపంచంలో దేశ స్థానాన్ని ప్రథమ స్థానంలో ఉంచేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యకర్తల సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పల్లె కుమార్, పూసల శ్రీమాన్, రంగు రాములు, ఆర్. కుమార్, నవీన్, యాకయ్య, రాజేష్, రాంబాబు, శ్రీనాథ్, సంతోష్ తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు


సీపీఎం మహాసభలో మాట్లాడుతున్న సూర్నపు సోమయ్య

## ఉద్యమాలతో ప్రజాసమస్యల పరిష్కారం

● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సూర్నపు సోమయ్య

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 8 : ఉద్యమాల ద్వారానే ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ ఒకటవ వార్డు పరిధిలోని ఈదులపూసపల్లిలో సీపీఎం మహాసభను విజయ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి ఒకటి, రెండుమినహా మిగతా హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, హేమానాయక్, గౌని వెంకన్న, నక్క సైదులు, దుగ్గి లక్ష్మీనారాయణ, బోయిని లక్ష్మణ్, వీరన్న, విష్ణు, రామకృష్ణ, వెంకటమ్మ, ప్రభాకర్‌రెడ్డి, సురేష్, అశోక్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఓబీసీ స్టేట్ వర్కింగ్ చైర్మన్‌గా వీరన్నయాదవ్



మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 8 : కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర కమిటీ వర్కింగ్ చైర్మన్‌గా మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రంకు చెందిన ప్రస్తుత ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేకల వీరన్న యాదవ్ నియామకమయ్యారు. ఈ మేరకు ఓబీసీ సెల్ జాతీయ చైర్మన్ కెప్టెన్. అజయ్‌సింగ్‌యాదవ్ మంగళవారం ప్రకటించి నియామక ఉత్తర్వులు అందించారు. మేకల వీరన్న కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి చేస్తున్న కృషిని గుర్తించి అధిష్ఠానం ఓబీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్‌గా అవకాశం కల్పించారు. తన నియామకానికి సహకరించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్లమెంట్ ప్రతిపక్ష నాయకులు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ఓబీసీ సెల్ జాతీయ చైర్మన్ కెప్టెన్ అజయ్‌సింగ్ యాదవ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేంనరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే భూక్యమురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్‌కు మేకల వీరన్న కృతజ్ఞతలు తెలిపారు.

## ఏషియన్ గేమ్స్‌కు షేక్ షాహిద్ ఎంపిక




కేసముద్రం, అక్టోబరు 8 : అర్పనపల్లికి చెందిన షేక్ షాహిద్ ఢిల్లీలోని రాజీవ్‌గాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 5, 6 తేదీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో సీనియర్స్ విభాగంలో బంగారు పతకం సాధించినట్లు అయన తండ్రి ఆటో జానీ, కోచ్ గంధసిరి యాకాంబ్రం తెలిపారు. గేమ్స్ అండ్ యాక్టివిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20వ ఓపెన్ ఛాంపీయన్‌షిప్ పోటీల్లో పాల్గొని ప్రథమస్థానం సాధించి, పతకం పొందినట్లు వారు చెప్పారు. వచ్చేనెలలో నేపాల్ లేదా దుబాయ్‌లో నిర్వహించే ఏషియన్ గేమ్స్‌కు షాహిద్ ఎంపికైనట్లు వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి తనకు సహకారం అందిస్తే మరిన్ని విజయాలు సాధిస్తానని షాహిద్ తెలిపారు.



## ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

డోర్నకల్, అక్టోబరు 8 : ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోనితోడేళ్లగూడెంలో చోటు చేసుకుంది. డోర్నకల్ ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం. తోడేళ్లగూడెం గ్రామానికి చెందిన చిలగడ ప్రసాద్ (38) మినీ ట్రక్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రసాద్ ఇటీవల మద్యానికి బానిసై పనికి పోకపోవడంతో భార్య అచ్చమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన ప్రసాద్ ఇంట్లో ఎవరు లేని సమయంలో పైపుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య అచ్చమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య అచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వైద్య నోడల్ అధికారిగా రాజ్‌కుమార్ జాదవ్



గార్ల అక్టోబరు 8 : గార్ల-బయ్యారం మండలాల వైద్య నోడల్ అధికారిగా ముల్కనూరు పీహెచ్‌సీ డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్‌ను నియమిస్తూ మంగళవారం హెల్త్ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.ఈమేరకు నియామక ఉత్తర్వు కాపీలను స్థానిక విలేకర్లకు అంద జేశారు. గార్ల, బయ్యారం గంధంపల్లి, ముల్కనూరు, గార్ల సీహెచ్‌సీ ఆసుపత్రుకు ప్రత్యేక నోడల్ అధికారిగా మంగళవారం పదవి బాధ్యతలను చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది విధులపట్ల నిర్లక్ష్యం చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ఝాన్సీరెడ్డికి కాంగ్రెస్ నాయకులు పరామర్శ


ఝాన్సీరెడ్డిని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తొర్రూరు, అక్టోబరు 8 : కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఇటీవల షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో గాయపడి చికిత్స పొందుతున్ననేపథ్యంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు పెదగాని సోమయ్య ఆధ్వర్యంలో పలువురు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాక్షేత్రంలో ఎప్పటిలాగే తిరగాలని పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీ నర్సింహ స్వామిని పూజించి తీసుకువచ్చిన కుంకుమ ప్రసాదాలు అందజేశారు. ఝాన్సీరెడ్డి భర్త హనుమాండ్ల రాజేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని కలిసి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంమోహన్ రెడ్డి, మనోహర్, గజానంద్, అచ్చిరెడ్డి, పెదగాని కళావతి, సోమన్న, శ్రీనివాస్, నరేష్ తదితరులు ఉన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

## బాధిత కుటుంబానికి రెడ్యా పరామర్శ

మరిపెడ, అక్టోబరు 8 : బాధిత కుటుంబాన్ని డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మంగళవారం పరామర్శించారు. గత కొద్ది రోజుల క్రితం మరిపెడ మున్సిపల్ పరిధిలోని లోక్యాతండాకు చెందిన భానోత్ హరి మృతి చెందారు. ఈ విషయం తెలిసి రెడ్యానాయక్ ఆ కుటుంబసభ్యులను కలుసుకొని ఓదార్చారు. రెడ్యా వెంట మున్సిపల్ కౌన్సిలర్ పానుగోత్ సుజాత వెంకన్న ఉన్నారు.

## అదనపు కలెక్టర్ పర్యటన


వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

నర్సింహులపేట, అక్టోబరు 8 : మండలకేంద్రంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో మంగళవారం పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలో 'మన ఊరు-మనబడి' పథకంలో జరిగిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు-మన బడి పథకంలో జరిగిన పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఈ పనులను త్వరిగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంఈవో రాంమోహన్‌రావు, ఎంపీవో కిన్నెర యాకయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

## పీఆర్టీయూ-టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా హాల్యనాయక్



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 8 : ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్-తెలంగాణ స్టేట్ (పీఆర్టీయూ-టీఎస్) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా మహబూబాబాద్ పట్టణానికి చెందిన హాల్యనాయక్‌ను ఏకగ్రీవంగా నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి మంగళవారం ప్రకటించారు. హైదరాబాద్‌లో ఈ నెల 7, 8 తేదీల్లో జరిగిన సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో రాష్ట్రశాఖ కమిటీని నియమించినట్లు తెలిపారు. ఈ కమిటీలో మహబూబాబాద్ మండలం గాంధీపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న హాల్యనాయక్‌ను రెండోసారి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నియమించినట్లు పేర్కొన్నారు.

## రైతులకు రుణమాఫీ అమలు చేయాలి



కురవిలో సీపీఐ సమావేశంలో మాట్లాడుతున్న నల్లు సుధాకర్‌రెడ్డి

కురవి, అక్టోబరు 8 : రైతాంగానికి రూ.2 లక్షల రుణమాఫీని తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్‌చేశారు. కురవిలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు తెగిన కుంటలు, చెరువులను తక్షణమే బాగు చేయాలన్నారు. రైతులకు వ్యవసాయ పెట్టుబడి కోసం తక్షణమే బ్యాంకుల్లో రైతుభరోసా జమ చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కర్నం రాజన్న, తురక రమేష్, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు పాల్గొన్నారు.

## పంటల నమోదును పరిశీలించిన ఏడీఏ


పాగుళ్లపల్లి సొసైటీలో తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీనివాస్

కొత్తగూడ, అక్టోబరు 8 : మండలంలోని పలు గ్రామాలలో పంటల నమోదును ఏడీఏ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. అలాగే గ్రామాలలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. పోగుళ్లపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని, గోదామును తనిఖీ చేశారు. ఈ పాస్‌మిషన్, స్టాక్ రిజిష్టర్‌ను, స్టాక్ బోర్డ్, యూరియా బస్తాల నిల్వలను పరిశీలించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఉదయ్, ఏఈవో యశ్వంత్ పాల్గొన్నారు.

## వన్యప్రాణులను వేటాడిన ఆరుగురి అరెస్టు

ములుగు, అక్టోబరు 8: ములుగు మండలం జాకారం శివారులో అడవి పంది, మనుపిల్లిని వేటాడి హతమార్చిన ఆరుగురిని మంగళవారం అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఫారెస్టు రేంజ్ అధికారి డోలి శంకర్ తెలిపారు. దాడిచేసిన అటవీశాఖ సిబ్బంది పంది, పిల్లి కలేబరాలను మంటల్లో కాల్చుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని అన్నారు. ఓర్సు కొమురయ్య, ఓర్సు పరుశురాములు, ముదంగుల రాజు, ఆలకుంట సోమయ్య, ఓర్సు రాజు, కొమురయ్య క్లచ్‌వైర్‌లతో ఉచ్చులను అమర్చి వేటాడుతున్నారని పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి వారిపై వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి, వారు ఉపయోగించిన ఆటోను సీజ్ చేశామని తెలిపారు.